సాక్షి సూర్యాపేట

శనివారం । 25 । మార్చి । 2023



తేనెటీగల పెంపకంతో ఉపాధి

తేనెటీగల పెంపకంతో యువతకు ఉపాధి అవకాశాలు ఉంటాయని నారం జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. - 10లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34 (శనివారం సాయంత్రం)

సహర్ 4-54 (ఆదివారం ఉదయం)

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37° / 25°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కుగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి



ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఉపాధి కల్పనాధికారి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలోని నిరుద్యోగులు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మినీ జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సామ మాధవరెడ్డి కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పనా కార్యాలయంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. మినీ జాబ్‌మేళాకు 3 ప్రైవేట్ కంపెనీలు హాజరుకాగా 465 ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించామని తెలిపారు. 65 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారని, అందులో 21 మందిని ఎంపిక చేసి నియామక పత్రాలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ చెన్నయ్య, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, కంపెనీల మేనేజర్లు పాల్గొన్నారు.

మానసికంగా అభివృద్ధి చెందాలి



ఎంఆర్ కిట్లను అందజేస్తున్న డీఈఓ

సూర్యాపేటటౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో శుక్రవారం ఎన్‌ఐఈపీఐడీ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగ విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఎంఆర్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు అందిస్తున్న ఎంఆర్ కిట్లను వినియోగించుకొని మానసికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఎన్‌ఐఈపీఐడీ ప్రతినిధి రాజేందర్ మాట్లాడుతూ జిల్లాకు ఈ సంవత్సరం 65 మందికి కిట్‌లను పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలోనే సూర్యాపేట జిల్లాకు అత్యధికంగా అందిస్తున్నామని చెప్పారు. ఒక్కో కిట్‌కు రూ.9,721 అవుతుందని, సమగ్ర శిక్ష సహకారంతో పూర్తిగా ఉచితంగా విద్యార్థులకు అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి యర్రంశెట్టి రాంబాబు, డీఎస్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని శుక్రవారం అర్చకులు విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేకార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదేవిధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం జరిపించారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ ఉత్తమ నోడల్ అధికారిగా రామకృష్ణ




అవార్డు, ప్రశంసాపత్రం అందుకుంటున్న లింగం రామకృష్ణ

మునగాల: మండలంలోని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ నోడల్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న లింగం రామకృష్ణ జిల్లా స్థాయి టీబీ ఉత్తమ నోడల్ అధికారిగా ఎంపికయ్యారు. శుక్రవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా వైద్యాధికారి డా.కోటాచలం చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈమేరకు రేపాల పీహెచ్‌సీ వైద్యాధికారి ముల్లా శ్రీశైలం, సిబ్బంది రామకృష్ణను అభినందించారు.

కొనుగోళ్లు ఎప్పుడో..

- ప్రారంభం కాని 2022- 23 రబీ సీజన్ కార్యాచరణ
- ప్రభుత్వం నుంచి అందని ఆదేశాలు
- ఏప్రిల్ మొదటి వారం నుంచి ధాన్యం మార్కెట్‌కు వచ్చే అవకాశం
- జిల్లాలో 1,90,253 హెక్టార్లలో వరిసాగు
- దిగుబడి అంచనా 12.72లక్షల మెట్రిక్ టన్నులు



దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో 2022- 23 రబీ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన కార్యాచరణ ప్రారంభం కాలేదు. ఇప్పటికే జిల్లాలో వరి కోతలు ప్రారంభం కాగా మరో వారం రోజుల్లో ఊపందుకోనున్నాయి. ఏప్రిల్ మొదటి వారం నుంచి మార్కెట్‌కు ధాన్యం వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ధాన్యం సేకరణకు సంబంధించిన ఏర్పాట్లపై ముందుగానే కసరత్తు ప్రారంభించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో కొనుగోలుకు ఏర్పాట్లు జరగడం లేదు.

ఊపందుకోనున్న కోతలు..

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ మొదటి వారం నుంచి వరి కోతలు ఊపందుకోనున్నాయి. వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం ఏప్రిల్‌లో 3.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు రానున్నది. అదే విధంగా మేలో 4.87లక్షల మెట్రిక్ టన్నులు, జూన్‌లో 2.43 లక్షల మెట్రిక్ టన్నులు, జూలై మాసంలో 1.21 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు రానున్నదని అంచనా. అయితే ప్రభుత్వం ధాన్యం కొనుగోలుపై ముందుగానే కసరత్తు ప్రారంభించి, ట్రాన్స్‌పోర్టు, గన్నీ బ్యాగులను సిద్ధం చేసుకోవాల్సి ఉంది. కానీ ఆ దిశగా అడుగులు పడడం లేదు. 2021- 22 రబీ సీజన్‌లో కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ఏర్పాటు చేసింది. దీంతో రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని బయటి మార్కెట్‌లో విక్రయించి నష్టపోయారు. ఈ సీజన్‌లో కూడా కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభమైతే రైతులకు నష్టం తప్పదు. రైతులు నష్టపోకుండా ఏప్రిల్ మొదటి వారం నుంచే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

వాతావరణం అనుకూలించడంతో..

ఈ రబీ సీజన్లో జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,38,415 హెక్టార్లు కాగా, వాతావరణం అనుకూలించడంతో 1,90,253 హెక్టార్లలో వరి సాగు చేశారు. ఒక్కో హెక్టారుకు సగటున సన్న ధాన్యం 6 మెట్రిక్ టన్నుల చొప్పున, దొడ్డు రకాలు 7 మెట్రిక్ టన్నుల చొప్పున దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ లెక్కన జిల్లాలో సాగైన 1,90,253 హెక్టారుల్లో 12,72,705 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరగనున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో రైతులు తమ అవసరాలకు సుమారు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం వినియోగించుకునే అవకాశం ఉంది. మిగిలిన 11.72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, స్థానిక మార్కెట్‌లలో విక్రయిస్తారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భాస్కర్‌రావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు

రైతాంగాన్ని రక్షించేందుకే బీఆర్‌ఎస్

- విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- నల్లగొండలో సహకార బంధువుల ఆత్మీయ సమ్మేళనం

నల్లగొండ టౌన్ : దేశంలో రైతాంగాన్ని రక్షించడానికి కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీని ఏర్పాటు చేశారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక లక్ష్మి గార్డెన్స్‌లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన సహకార బంధువుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కావాలని దేశవ్యాప్తంగా ఉన్న రైతులు కోరుకుంటున్నారని చెప్పారు. హస్తినలో రైతులు చేసిన పోరాటాలు కేసీఆర్‌ను కదిలించించాయన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా.. రాష్ట్రంలో నిరంతరం 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. వ్యవసాయ రంగంలో నల్లగొండ జిల్లా అద్భుత ప్రగతిని సాధించని చెప్పారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్న కేసీఆర్‌కు మనమంతా అండగా నిలవాలని కోరారు. డీసీసీబీ పాలకవర్గం, ఉద్యోగులు సమష్టిగా కృషి చేసి ప్రగతిపథంలో ముందుంచినందుకు చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో పాటు పాలకవర్గాన్ని, ఉద్యోగులను మంత్రి అభినందించారు. ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు పురోగాభివృద్ధికి కృషి చేసిన పాలకవర్గాన్ని అభినందిస్తున్నామన్నారు. డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తమ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన మూడేళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా రూ.2200 కోట్ల టర్నోవర్‌లో సాధించామని చెప్పారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన మొబైల్ ఏటీఎం వాహనాన్ని మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా టెస్కాబ్ చైర్మన్ కె.రవీందర్‌రావును పాలకవర్గం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే భాస్కర్‌రావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు తిప్పన విజయసింహారెడ్డి, కంచర్ల రామక్రిష్ణారెడ్డి, దూదిమెట్ల బాలరాజు, డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య, నార్మాక్స్ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, అప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ మోతె సోమిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ఆల్డా చైర్మన్ పిచ్చిరెడ్డి, సీఈఓ మదన్ మోహన్, డైరెక్టర్లు సంపత్‌రెడ్డి, అంజయ్య ఉన్నారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి



కట్టమైసమ్మ ఆలయానికి భూమి పూజ చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట పట్టణంలోని సద్దల చెరువు కట్టపై కట్ట మైసమ్మ నూతన ఆలయ నిర్మాణానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో సద్దల చెరువుతో పాటు కింద ఉన్న అనేక చెరువులు ఏటా నిండుతున్నాయని తెలిపారు. ప్రజలు, రైతులు, మత్స్యకారులు అమ్మవారి దీవెనలతో ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, బీఆర్‌ఎస్ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం గౌరవ అధ్యక్షుడు ఆకుల లవకుశ, కౌన్సిలర్లు శ్రీనివాస్, యాదగిరి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు సారగండ్ల కోటయ్య, ఉపాధ్యక్షుడు నల్లమేకల వెంకన్న, సుంకరబోయిన నాగరాజు, సురేష్, డైరెక్టర్లు, నాయకులు ఉన్నారు.

గుణాత్మక మార్పులపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ వెంకట్రావు



కస్తూర్బా పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

పెన్‌పహాడ్: పరిపాలనా విభాగంలో గుణాత్మకమైన మార్పు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ వెంకట్రావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, కేజీబీవీ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కార్యాలయంలోని రికార్డులు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, అధికారుల విధి నిర్వహణ సక్రమంగా జరగాలనే ఆలోచనతోనే ప్రతి శాఖపై ప్రత్యేకమైన టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి పనితీరు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పారిశ్రామిక, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాల కోసం ప్రభుత్వ భూములను గుర్తించి భవిష్యత్ అవసరాల కోసం భూ కేటాయింపులు చేయనున్నట్లు పేర్కొన్నారు. ధరణితో ఇబ్బందులు పడుతున్న రైతులు దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో వారు ప్రత్యేకంగా జీవనోపాధి పొందేందుకు స్వయం ఉపాధి యూనిట్లను స్థాపించడమే కాకుండా యూనిట్ల ద్వారా ఉత్పత్తి అయిన వాటికి మార్కెటింగ్ సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. మన ఊరు- మన బడి పనులు త్వరితగతిన పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తేవాలని సూచించారు. పోషణ్ పక్వాడాలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 15రోజుల పాటు జరిగే పోషక ఆహారం ఎలా తీసుకోవాలి, మహిళలు అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఐకేపీ, స్వయం శక్తి సంఘాలు పోషక ఆహారాలు ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, పీఆర్ఏఈ గోపి, కస్తూర్బా ఎస్ఓ ఆసియా జబీన్ తదితరులు పాల్గొన్నారు.

కాపుగల్లు పీహెచ్‌సీకి ఉత్తమ అవార్డు

కోదాడరూరల్: మండల పరిధిలోని కాపుగల్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం జాతీయ నాణ్యతా ప్రమాణాల వార్డులో మొదటి స్థానంలో నిలిచినట్లు జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాన్‌చక్రవర్తి, స్థానిక వైద్యాధికారి డాక్టర్ ధర్మతేజ శుక్రవారం తెలిపారు. మూడు నెలల కిందట ఎన్‌క్యూఏఎస్ బృందం కాపుగల్లు ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిందని, వైద్యశాలలో పలు విభాలను పరిశీలన అనంతరం 85.2 శాతంతో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు తమవంతుగా కృషి చేస్తున్నామని వారు తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బంది, జిల్లా అధికారుల సహకారంతో అవార్డు సాధ్యమైందని పేర్కొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

- అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

సూర్యాపేట: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ కోరారు. క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని కల్నల్ సంతోష్ బాబు విగ్రహం దగ్గర నుంచి ప్రభుత్వ మెడికల్ కాలేజీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైద్య శాఖ, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా పోరాడినప్పుడే క్షయ వ్యాధి నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. రెండు వారాల పాటు దగ్గు ఉంటే పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయ నిర్మూలనకు అంకితభావంతో కృషి చేసిన సిబ్బందికి ప్రశంసపత్రాలు అందజేశారు. 2025 నాటికి టీబీని అంతం చేయడానికి కలిసికట్టుగా పనిచేయాలని ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం, జిల్లా టీబీ అధికారి డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ శ్రీనివాసరాజు, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ మౌనిక ఉన్నారు.

విజృంభిస్తున్న వైరల్ ఫీవర్

- జ్వరపీడితులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- దగ్గు, జలుబు, తలనొప్పితో బాధపడుతున్న జనాలు



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఓపీ వద్ద క్యూలో నిల్చున్న రోగులు

సూర్యాపేట: జిల్లాలో వైరల్ ఫీవర్ విజృంభిస్తోంది. పదిహేను రోజులుగా ప్రతి నలుగురిలో ఒకరు ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్నారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు జ్వరాలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇవి కోవిడ్ లక్షణాలుగా ఉండడంతో భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా పిల్లల ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. దగ్గు, జలుబు, జ్వరంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వైరల్ ఫీవర్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుండడంతో కుటుంబ సభ్యులంతా జ్వర పీడితులుగా మారుతున్నారు. వాతావరణ మార్పుల కారణంగా ఈ వైరల్ ఫీవర్ కాస్త నిమోనియాగా మారి ఊపిరితిత్తులకు చేరడంతో వృద్ధులు, ఆస్తమా వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు పడుతున్నారు. జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదం తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

భయపెడుతున్న ఇన్‌ఫ్లూయెంజా..

ఏటా జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ఫ్లూ జ్వరాలు నమోదవుతున్నాయని ప్రభుత్వ వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం 'ఇన్‌ఫ్లూయెంజా' (హెచ్3 ఎ2) లక్షణాలు కలిగిన వైరల్ ఫీవర్ ప్రబలుతోందని వైద్యులు పేర్కొంటున్నారు. జ్వర పీడితులు వారం దాటితే అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. డయాబెటిక్ రోగులు, ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలున్నవారు, వద్ధులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఈ వైరల్ జ్వరం ఊపిరితిత్తులోకి వెళ్లి నిమోనియాగా మారితే ప్రాణాపాయస్థితికి చేరుకుంటారని పేర్కొంటున్నారు.

మంచాన పడుతున్న జనం..

పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రస్తుతం ఏ ఇంట్లో చూసినా ఒకరిద్దరు జ్వర పీడితులుగా ఉంటున్నారు. తండా ప్రాంతాల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. తీవ్రమైన జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులు, తలనొప్పి కారణంగా నడవలేకపోతున్నారు. అయితే వారం రోజుల్లో మామూలు స్థితికి వస్తున్నారు. గత నెలలో జిల్లాలో స్వైన్ ఫ్లూ కేసులు సైతం నమోదైన విషయం తెలిసిందే. అయితే తీవ్ర జ్వరం, స్వైన్ ఫ్లూ లక్షణాలు ఉన్నవారి నమూనాలను వైద్య అధికారులు సేకరించి హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. ప్రస్తుతం అయితే జిల్లాలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుతం జిల్లాలో వైరల్ ఫీవర్ ప్రభావం ఉంది. ఈన్‌ఫ్లూయెంజా లక్షణాలు కనిపిస్తున్నాయి. చాలా మంది దగ్గు, జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులతో పాటు నీరసంగా ఉంటున్నారు. కోవిడ్ సమయంలో పాటించిన జాగ్రత్తలే మళ్లీ పాటించాలి. జ్వర పీడితులు కాచి చల్లార్చిన నీటిని తాగాలి. డయాబెటిస్, ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలి. వాతావరణ మార్పుల కారణంగా ఈ వైరల్ ఫీవర్ వ్యాప్తి చెందుతుంది.

– డాక్టర్ రామ్మూర్తి, సీనియర్ ఫిజీషియన్

మాస్కులు ధరించాల్సిందే..

వైరల్ ఫీవర్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. హెచ్3 ఏ2 వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ మాస్కులు ధరించాలని సూచిస్తున్నారు. విందులు, వినోదాలు, శుభకార్యాలకు వెళ్లనప్పుడు ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. మాస్క్ ధరించడం వల్ల వైరస్‌ను అరికట్టవచ్చని చెబుతున్నారు. తరచూ శానిటైజర్ వాడాలని సూచిస్తున్నారు.

వైద్యులు వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాలి

- ఎస్పీ రాజేంద్రప్రసాద్

సాక్షి ఎఫెక్ట్



మాట్లాడుతున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం: వైద్యులు తమ వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. 'కడుపులో కడతేరుస్తుండ్రు..' అనే శీర్షికన ఈనెల 23న సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎస్పీ స్పందించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పట్టణంలోని సీనియర్ వైద్యులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగనిర్ధారణ, పిండ విచ్చిత్తి లాంటి ఘటనలతో కొద్దిరోజులుగా వివాదాస్పదమవుతుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైద్యరంగం సమాజంలో విశ్వాసం కోల్పోతుందన్నారు. ఇలాంటి చర్యల వల్ల జిల్లా కేంద్రానికి చెడ్డ పేరు వస్తుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఆస్పత్రులు కృషి చేయాలని కోరారు. లింగ నిర్ధారణ పరీక్షలు, పిండ విచ్చిత్తికి పాల్పడకుండా ఉండాలని.. ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్ట ఉల్లంఘన చర్యలకు పాల్పడే ఆస్పత్రులు, స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్స్, వైద్యులపై మెడికల్ అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్, వైద్యులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

అర్వపల్లి: గ్రామగ్రామాన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ కోరారు. శుక్రవారం అర్వపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులు, కేసుల తీవ్రతను సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాల్లో పోలీసులు భాగస్వామ్యం కావాలన్నారు. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే నేరాలు తగ్గుతాయని తెలిపారు. ఈ సందర్భంగా స్టేషన్ భౌగోళిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం సిబ్బంది కవాతు, వారి యూనిఫామ్, కిట్ల సామగ్రిని పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీ నాగభూషణం, నాగారం సీఐ రాజేష్, స్పెషల్ బ్రాంచ్ సీఐ తులా శ్రీనివాస్, ఐటీ కోర్, డీసీఆర్‌బీ ఎస్సైలు రవీందర్, సత్యనారాయణ, స్థానిక ఎస్సై అంజిరెడ్డి, ఏఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి



ట్రెజరీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు

సూర్యాపేటటౌన్: కొన్ని నెలలుగా ఈ కుబేర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ మంజూరు చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకుడు సోమయ్య, కృష్ణారెడ్డి, లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా ట్రెజరీ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ బకాయిలు, పీఆర్సీ బకాయిలు, సరెండర్ వేతనాలు, జీపీఎఫ్ అప్పులు, పార్ట్ ఫైనల్, ఫైనల్ పేమెంట్లు, ఎయిడెడ్ ఉపాధ్యాయుల మూడు నెలల వేతనాలు మంజూరు చేయకుండా ఈ కుబేర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆర్థిక సంవత్సరం పూర్తి కావస్తున్నందున ఈ నెల 28 లోపు బిల్లులన్నీ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్.అనిల్‌కుమార్, ముత్తయ్య, భిక్షపతి, బీవీ రావు, శ్రీనివాస్‌రెడ్డి, వీరన్న, సీహెచ్.వెంకటేశ్వర్లు, వెంకటయ్య, సుభాని, దశరథరామారావు, యాకయ్య, టి.పూలన్, సిద్దిక్‌పాషా, సయ్యద్, కృష్ణమూర్తి, వెంకటయ్య, మంగ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తొమ్మిది ఆవుదూడల పట్టివేత

కోదాడరూరల్ : అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది ఆవుదూడలను శుక్రవారం రూరల్ పోలీసులు పట్టుకున్నారు. కాకినాడ జిల్లా తుని నుంచి హైదరాబాద్‌కు డీసీఎం వాహనంలో ఆవుదూడలను తరలిస్తుండగా మార్గ మధ్య లోని రామాపురం క్రాస్‌రోడ్‌లోని చెక్ పోస్ట్‌వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. వాటిని హైదరాబాద్‌లోని గోశాలకు తరలించి డీసీఎం డ్రైవర్ దేవవు నానితో పాటు యజమాని దేమల్లుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


యాదు మృతదేహం

బీబీనగర్: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని గుర్రాలదండి గ్రామ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రాలదండి పరిధిలోని కుచ్చబోడు తండాకు చెందిన ధారావత్ యాదు(45) చిన్నరావులపల్లి పరిధిలోని హిందుస్థాన్ పరిశ్రమల్లో పనిచేస్తున్నాడు. కాగా యాదు ఉదయం తండా సమీపంలో గల శ్రీకర టెక్స్‌టైల్స్ పరిశ్రమ వెనుక భాగంలో గల మూసీ వాగులో చేపలు పట్టేందుకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయలుదేరాడు. పరిశ్రమ వెనుక భాగంలో గల విద్యుత్ వైర్లకు సరఫరా అవుతుండడంతో వాటికి తగిలిన యాదు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గీతకార్మికుడు మృతి

చింతపల్లి : తాటిచెట్టుపై నుంచి కిందపడడంతో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గీత కార్మికుడు మృతిచెందాడు. ఎస్‌ఐ బాలకిషన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధనాపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు ముద్దం వెంకటయ్య(53) గ్రామంలో కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 12న తాటికల్లు కోసం చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడడంతో తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుని భార్య ముద్దం పోశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం


శాంతి (ఫైల్)

హుజూర్‌నగర్: వివాహిత అదృశ్యమైంది. ఈ ఘటన హుజూర్‌నగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్‌లోని చింతల బజార్‌కు చెందిన రేపన జానకమ్మ చిన్న కుమార్తె రెపన శాంతికి ఆరేళ్ల క్రితం నాగార్జునసాగర్‌కు చెందిన కృష్ణంరాజుతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం కాగా, శాంతికి ఆరోగ్యం బాగోలేక నెల రోజులుగా పట్టణంలోని తల్లి వద్దనే ఉంటుంది. ఆమె భర్త కృష్ణరాజు ఉద్యోగరీత్యా చెన్నైలో ఉంటున్నాడు. అయితే, శుక్రవారం శాంతి తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో ఆమె తల్లి జానకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పత్రికలు


సాక్షి పేపర్ బాయ్స్‌కు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, పక్కన అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, శ్రీనివాస్‌రెడ్డి, సాక్షి సిబ్బంది


నల్లగొండలోని యూనిట్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న సాక్షి సిబ్బంది

- సాక్షి దినపత్రిక సేవలు అభినందనీయం
- భువనగిరి కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరి : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య పత్రికలు వారధిగా పనిచేస్తాయని, అందులో సాక్షి దినపత్రిక సేవలు అభినందనీయమని భువనగిరి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సాక్షి 15 వార్షికోత్సవ సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆమె అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, డి.శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి కేక్ కట్ చేశారు. సాక్షి పేపర్ బాయ్స్‌కు బహుమతులు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సాక్షి దినపత్రిక ప్రజల్లోకి మరింతంగా వెళ్లాలని ఆకాక్షించారు. సాక్షి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలను తెలియజేశారు. ఉదయాన్నే లేచి ఇంటింటికి పేపర్ వేసే బాయ్స్‌ని ఆమె అభినందించారు. ప్రతి రోజు ఉదయం పేపర్ వేస్తూ.. విద్యాభ్యాసం కొనసాగిస్తున్న పేపర్ బాయ్‌ల కంటే స్ఫూర్తి ప్రదాతలు ఎవరుంటారని కొనియాడారు. అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం కూడా పేపర్ వేసి చదువుకుంటూ రాష్ట్రపతిగా ఉన్నత స్థాయికి చేరుకున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి నాగేశ్వరాచారి, సాక్షి భువనగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ యంబ నర్సింహులు, రిపోర్టర్లు, సాక్షి సిబ్బంది ఎం.వెంకటేశ్, కల్లెం సంపత్, భరత్, అశోక్, రావులరాజు, వనం రాజు, ఫొటో గ్రాఫర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ యూనిట్ కార్యాలయంలో..

రామగిరి(నల్లగొండ): సాక్షి 15 వార్షికోత్సవం శుక్రవారం నల్లగొండ యూనిట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సాక్షి కుటుంబ సభ్యులంతా కలిసి 15కిలోల కేక్ కట్ చేశారు. ఆయా విభాగాలకు చెందిన సిబ్బంది మాట్లాడు తూ.. సాక్షి స్థాపించిన నాటి నుంచి సంస్థతో వారి కున్న అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రుక్మాధర్, ఎడిషన్ ఇన్‌చార్జి బి.జనార్దన్‌రెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి సిహెచ్.గణేష్, భువనగిరి స్టాఫ్ రిపోర్టర్ నర్సింహులు, యాడ్స్ మేనేజర్ వెంకన్న, సర్క్యులేషన్ డిప్యూటీ మేనేజర్ శ్రీనివాస్, ప్రొడక్షన్ అసిస్టెంట్ మేనేజర్ మల్లయ్య, అకౌంట్స్, స్టోర్స్ ఇన్‌చార్జులు హరిబాబు, మల్లేష్, ఫొటోగ్రాఫర్లు భజరంగ్ ప్రసాద్, యాకయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

- దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు


కౌన్సిలింగ్‌లో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

దేవరకొండ : మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు హెచ్చరించారు. శుక్రవారం దేవరకొండ డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి వారి బంధువుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంకన్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వలన కలిగే అనర్థాలను వివరించారు.ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే జరుగుతున్నాయని పేర్కొన్నారు.మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడే వారికి చలానాలు విధించడంతో పాటు కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుశాఖ పటిష్ట చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిండి సర్కిల్ సీఐ పరశురాం, ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఇంచార్జ్ సంతోష్, ఎస్‌ఐ సతీష్,తదితరులున్నారు.

కాపురానికి తీసుకెళ్లాలని నిరాహార దీక్ష


భర్త ఫంక్షన్‌హాల్ ఎదుట నిరసన తెలుపుతున్న అనూష, కుటుంబ సభ్యులు

ఆత్మకూర్-ఎస్(సూర్యాపేట) : భర్త తనను కాపురానికి తీసుకెళ్లాలని కోరుతూ ఓ మహిళ తన చంటిపాపతో మండలంలోని ఏనుబాముల స్టేజీ వద్ద గల ఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్ గేటుకు శుక్రవారం తాళం వేసి నిరాహార దీక్షకు దిగింది. మండలంలోని నెమ్మికల్‌కు చెందిన జటంగి రామనర్సు కూతురు అనూషను 2020 ఫిబ్రవరిలో మామిళ్లమడవకు చెందిన కొర్వి వీరన్న కొడుకు ప్రవీణ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరి కాపురం ఏడాదిన్నర పాటు సజావుగా సాగింది. వీరికి కూతురు జన్మించింది. అనంతరం దంపతుల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఏడాది కాలంగా అనూష తన పాపతో కలిసి పుట్టింట్లోనే ఉంటుంది. పలుమార్లు పెద్ద మనుషులు పంచాయితీ చేసినా మెట్టింటి వారు అనూషను తీసుకెళ్లడం లేదు. దీంతో అనూష తన పాపతో కలిసి భర్తకు చెందిన ఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్ గేటుకు తాళం వేసి నిరాహార దీక్షకు దిగింది. తనకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తానని తెలిపింది. ఆమె దీక్షకు మద్దతుగా నెమ్మికల్‌కు చెందిన పలువురు మహిళలు వచ్చి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అనూష తల్లిదండ్రులు జటంగి రామనర్సు, గణిత, కుటుంబ సభ్యులు నాగయ్య, మల్లేష్, స్వామి, లింగమ్మ, మహిళలు పాల్గొన్నారు.

తెలంగాణ ఏర్పాటుతోనే గ్రామాలు అభివృద్ధి


గుండెపురిలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

తిరుమలగిరి (తుంగతుర్తి) : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాతనే గ్రామాలన్నీ అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుండెపురిలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని, పల్లెప్రకృతి వనాన్ని, రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానిదే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, జెడ్పీటీసీ దూపటి అంజలి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమ్మినేని స్రవంతిసతీష్‌కుమార్, గ్రామ సర్పంచ్ పాక రేణుక, ఎంపీటీసీ జమ్మిలాల్, తహసీల్దార్ రమణారెడ్డి, ఎంపీడీఓ ఉమేష్‌చారి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సతీష్, లక్ష్మయ్య, నారాయణరెడ్డి, ఎస్.నరోత్తమ్‌రెడ్డి, రవీందర్, షకీల్‌పాషా పాల్గొన్నారు.

ముగిసిన బార్ అసోసియేషన్ నామినేషన్ల దాఖలు


అధ్యక్ష పదవికి నామినేషన్ వేస్తున్న అశోక్

చివ్వెంల (సూర్యాపేట) : ఈనెల 31న జరగనున్న సూర్యాపేట జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ముగిసింది. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ముగ్గురు, ఉపాధ్యక్ష పదవికి ఇద్దరు, ప్రధాన కార్యదర్శి పదవికి నలుగురు నామినేషన్లు వేశారు. కోశాధికారి, లైబ్రేరియన్, గేమ్స్ అండ్ కల్చరల్, ఈసీ మెంబర్స్‌కు సంబంధించి పోటీ లేకపోవడంతో ఏకగ్రీవం కానున్నాయి. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్, న్యాయవాదులు ఉన్నారు.

మంత్రుల పర్యటన ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

హుజూర్‌నగర్ : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రులు జి.జగదీశ్‌రెడ్డి, ఎస్.నిరంజన్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌లతో పాటు పలువురు ఎమ్మెల్యేలు శనివారం రానున్నారు. ఈ నేపథ్యంలో మంత్రులు పాల్గొనే సభాస్థలి ప్రాంగణాన్ని, ఇతర ఏర్పాట్లను ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సైదిరెడ్డి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని ఆయన కోరారు. వారి వెంట సీఐ రామలింగారెడ్డి, ఎస్‌ఐ వెంకటరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు పుస్తకం అందజేత..

రచయిత మనోహర్ చిమ్మని రచించిన కేసీఆర్ ద ఆర్ట్ పాలిటిక్స్ పుస్తకాన్ని బీఆర్‌ఎస్ నాయకుడు పృథ్వీకుమార్ ఎమ్మెల్యేకు అందజేశారు.

రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు


పెన్‌పహాడ్ : మాచారంలో ఆయుష్మాన్ భారత్‌లో పేరు నమోదు చేయిస్తున్న వెంకటేశ్వర్‌రావు

పెన్‌పహాడ్ : తెలంగాణ రాష్ట్రంలో అవినీతిని అంతమొందించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే బీజేపీ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మాచారం గ్రామంలో ఆయుష్మాన్ భారత్ ఆన్‌లైన్ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తే కేంద్రం సహకరించడం లేదంటూ కేంద్ర ప్రభుత్వంపై నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అదే విధంగా మండల పరిధిలోని చెట్లముకుందాపురం గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు అనంతుల గుర్వయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పోకల రాములు, పోకల వెంకటేశ్వర్లు, చెన్ను రమణారెడ్డి, యగ్గడి సతీష్, మామిడి శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్జనే ధ్యేయంగా లిక్కర్ కుంభకోణం

చివ్వెంల(సూర్యాపేట) : సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు వేలకోట్ల రూపాయల అక్రమార్జనే ధ్యేయంగా లిక్కర్ కుంభకోణానికి పాల్పడి ఇప్పుడు అడ్డంగా దొరికి తెలంగాణ వాదాన్ని అడ్డు పెట్టుకున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో ఆయుష్మాన్ భారత్ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. లిక్కర్ కుంభకోణంలో మరోసారి వారి కుటుంబ సభ్యులను రక్షించుకునే పనిలో సీఎం కేసీఆర్ ఉన్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పేరాల లక్ష్మణ్‌రావు, జంపాల వెంకటేశ్వర్లు, ఉప్పోజు వీరాచారి, ధరావతు అశోక్, తండు సైదులు, దండ సతీష్, వీరస్వామి, మల్లయ్య, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ పేదలకు వరం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం పేద ప్రజలకు వరం లాంటిదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో 12వ వార్డులో ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరితే సీఎం రిలీఫ్ ఫండ్ కోసం నాయకుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5లక్షల ఉచిత ఆరోగ్య బీమా లభిస్తుందని, పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం కోరుకుంటే ప్రతి కుటుంబాన్ని ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, పట్టణ అధ్యక్షుడు ఎండీ అబీద్, కౌన్సిలర్ కట్కూరి కార్తీక్‌రెడ్డి, జిల్లా నాయకులు తుక్కాని మన్మధరెడ్డి, సలిగంటి వీరేంద్ర, పలస మల్సూర్‌గౌడ్, చల్లమల్ల నరసింహ, మీరు అక్బర్, సైదులు, పట్టణ ప్రధాన కార్యదర్శులు ఆరూరి శివ, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న డీసీఎం

- డీసీఎం క్యాబిన్‌లో ఇరుక్కొని ఒకరి మృతి.. డ్రైవర్‌కు తీవ్రగాయాలు
- బస్సులోని ప్రయాణికులు క్షేమం


బాలకృష్ణ మృతదేహం


క్యాబిన్‌లో ఇరుకున్న క్షతగాత్రులను బయటికి తీస్తున్న పోలీసులు

చౌటుప్పల్ : ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును డీసీఎం ఢీకొట్టడంతో ఒకరు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ శివారులో గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా పైడిచింతపాడు గ్రామానికి చెందిన సిర్దు బాలకృష్ణ(42) తన డీసీఎంలో కూరగాయలను లోడు చేసుకుని హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌కే వెళ్తున్న సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ లింగోజిగూడెం శివారులోని ఓ హోటల్ ఎదురుగా ప్రయాణికుల మూత్ర విసర్జనకు బస్సును రోడ్డు వెంట ఆపాడు. ఆ సమయంలో డీసీఎం వాహనం ఆర్టీసీ బస్సు వెనుక నుండే వస్తుంది. ఎలాంటి ముందస్తు సంకేతాలు ఇవ్వకుండా బస్సును నిలపడంతో డీసీఎం డ్రైవర్ శ్రీనివాస్ వేగంగా వెళ్లి వెనుకనుంచి దానిని ఢీకొట్టాడు. దీంతో డీసీఎంలోని ఇద్దరు క్యాబిన్‌లో ఇరుకున్నారు. తీవ్రంగా గాయపడిన బాలకృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సీఐ మల్లికార్జున్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. క్యాబిన్ నుంచి ఇద్దరిని బయటకు తీశారు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని బాలకృష్ణ మృతదేహాన్ని పశ్చిమ గోదావరి జిల్లాలోని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సందర్శించి నివాళులు అర్పించారు. ఇదిలా ఉండగా ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలవ్వలేదు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

మిర్యాలగూడ : గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన దామరచర్ల మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వాడపల్లి ఎస్‌ఐ ఎం.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన తాడోజు గోవిందాచారి(63) మద్యానికి బానిసై రోడ్ల వెంట తిరుగుతున్నాడు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని బస్టాప్ వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా మిర్యాలగూడ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో గోవిందాచారికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమి త్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెరటి కోళ్ల పెంపకంలో జాగ్రత్తలే కీలకం

- వేసవిలో వ్యాధులు సోకే అవకాశం
- బద్దె పురుగు అత్యంత ప్రమాదకరం
- వ్యాధి నిరోధక శక్తి, గుడ్ల ఉత్పత్తి, పెరుగుదలపై ప్రభావం
- వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పెద్దవూర పశువైద్యాధికారి చంద్రబాబు సూచనలు


చంద్రబాబు, పశువైద్యాధికారి


ఇంటిలో పెంచుతున్న నాటు కోళ్లు

పాడి పంట

పెద్దవూర : వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమ ఆ తర్వాత కోళ్ల పెంపకానిదే. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంట్లో నాటుకోళ్లను సాకుతారు. ఎవరైనా బంధువులు వచ్చినా, పండుగలకు, పబ్బాలకు ఇంట్లో పెంచుకున్న కోళ్లను కోసి ఆరగిస్తుంటారు. ప్రస్తుతం నాటుకోళ్ల ట్రెండు నడుస్తోంది. ఏటేటా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ సారి ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వేడి పెరిగే కొద్ది కోళ్ల ఫారం యజమానులు, పెరటి కోళ్ల యజమానులు వాటి రక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఏ మాత్రం ఆలస్యం చేసినా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం లేకపోలేదు. ముఖ్యంగా వేసవిలో బద్దె పురుగు వ్యాధి ప్రబలుతుంది. ప్రమాదకర ఈ వ్యాధి నుంచి కోళ్లను రక్షించుకునేందుకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దవూర పశువైద్యాధికారి డాక్టర్ పిట్టల చంద్రబాబు సూచిస్తున్నారు.. వివరాలు ఆయన మాటల్లోనే..

బద్దె పురుగు ఇలా..

పరాన్న జీవులు రెండు రకాలు. అవి అంతర పరాన్న జీవులు, బాహ్యపరాన్న జీవులు. బద్దె పురుగుల వంటి అంతర పరాన్న జీవులు కోళ్ల పేగుల్లో నివసిస్తూ వాటి పోషక పదార్థాలను సుష్టిగా హరించి వేస్తూ, జీవాల్లో ఉత్పాదక శక్తిని తగ్గిస్తాయి. చివరకు వాటిని బలహీన పరిచి పెరుగుదల లేకుండా చేస్తాయి. బద్దె పురుగులు తెల్లగా సన్నటి రిబ్బను లాంటి శరీర సౌష్టవం కల్గి ఉంటాయి.

వ్యాధి సంక్రమించే విధానం

కొన్ని రకాల చీమలు, ఈగలు, మిడతలు, పేడపురుగు, నేలపై తిరిగే నత్తలు కోడి పెంటలోని బద్దె పురుగుల గుడ్లను తినడంతో వాటి లార్వాదశ ఈ కీటకాల్లో పెరుగుతుంది. కోళ్లు ఈ కీటకాలను తిన్నప్పుడు లార్వాదశ పేగుల్లో పెరిగి బద్దెపురుగులా మారుతాయి.

కలిగే హాని..

చిన్న వయస్సులో కోళ్లకు ఎక్కువగా ఈ బద్దె పురుగుల వ్యాధి సంక్రమిస్తుంది. వ్యాధి సోకిన కోళ్ల కాళ్లలో నిస్సత్తువ, పెరుగుదల లేకపోవడం, ఎక్కువ నీరు తాగడం, గుడ్ల ఉత్పత్తి తగ్గడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. అతి చిన్న బద్దె పురుగులు పేగు గోడల లోనికి చొచ్చుకొని పోవడంతో రక్త స్రావం కలిగి కోళ్లు చనిపోతుంటాయి. మరి కొన్ని పేగులపై చిన్న చిన్న గడ్డలు ఏర్పరుస్తాయి. బద్దె పురుగులు ఎక్కువ సంఖ్యలో ఉండి పేగుల్లో అహార కదలికకు అడ్డుపడడమేకాక, వాటి ఒత్తిడితో పేగులు బద్దలై కోళ్లు చనిపోయే ప్రమాదం కూడా ఉంది. ఈ పురుగుల వలన రోగనిరోధక శక్తి తగ్గి ఇతర వ్యాధుల టీకాలు వేసినా సత్ఫలితాలు ఇవ్వకపోవచ్చు.

రోగ నిర్ధారణ ఇలా..

కోళ్ల గుంపులో ఎదుగుదల లేకున్నా, గుడ్ల ఉత్పత్తి తగ్గినా బద్దెపురుగుల వ్యాధి ఉందని గ్రహించాలి. కోడిపెంటలో బద్దె పురుగుల శరీర ఖండాలు బియ్యపు గింజల్లాగా కనిపిస్తాయి. వ్యాధి నిర్ధారణకు ఒక కోడిని కోసి అందులోని పేగులను చూస్తే బద్దె పురుగులు కనిపిస్తాయి.

చికిత్స నివారణ చర్యలు..

ఈ వ్యాధి సోకితే కిలో బరువుగల కోడికి బ్యూటినోరెట్ 150 మిల్లి గ్రాములు, డైక్లోరోఫెన్ 200 గ్రాములు దాణాలో ఇవ్వాలి. మెబెండజోల్ పౌడర్ వంద కోళ్లకు 10 మి.గ్రా. చొప్పున దాణాలో ఇవ్వాలి. ఫెన్‌బెండజోల్, ప్రాజీక్వాంటాల్ వంటి ఇతర మందులను కూడా వాడవచ్చు. అలాగే కోళ్లు పెంచే ప్రాంతాల్లో కీటకాలు వ్యాప్తి చెందకుండా డెల్టామెత్రిన్ అనే మందు ద్రావణాన్ని నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేకపోతే ఫినాల్, సైథియాన్ వంటి క్రిమి సంహారక మందులను నీటిలో కలిపి కోళ్ల షెడ్డు లోపల చుట్టు పక్కల పిచికారీ చేయాలి.